www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 డిసెంబర్ 2025

'ఎస్పి కార్యాలయం ఏర్పాటుకు అన్వేషిస్తున్నాం'

సిఎస్ఐ బాలికల పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లె జిల్లా ఎస్పి కార్యాలయం ఏర్పాటుకు పట్టణంలో పలుచోట్ల భవనాలను పరిశీలించి, ఎంపిక కోసం అన్వేషిస్తున్నామని ఎస్పి ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మంగళవారం ఎస్పి, డిఎస్పి మహేంద్ర, సిఐ మహ్మద్ రఫీ, ఆర్ఐ బాలస్వామిలతో కలిసి స్థానికంగా ఉన్న పలు ప్రభుత్వ, మిషనరీ భవనాలను పరిశీలించారు. నిమ్మనపల్లె రోడ్డులో ఉన్న జిఎంఆర్ పాలిటెక్నిక్ భవనాలు, సిఎస్ఐ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల భవనాలు, మదనపల్లె బిటి కళాశాల భవనాలు, రేస్ కళాశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జనవరి 1 నుంచి జిల్లా అమలు కానున్న నేపథ్యంలో ఎస్పి కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే ఎస్పి కార్యాలయంలో ఉన్న అన్ని వింగులు నిర్వహించేందుకు అనువైన భవనాన్ని ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (పుల్లంపేట)

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల అన్నారు. మంగళవారం ఎపిఎండిసి సంస్థ వద్ద పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ జీవనోపాధికి ఆధారపడుతున్న వేలాది మందికి ఎపిఎండిసి సంస్థను పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఉపాధి కోసం ప్రజల అవసరాల కోసం ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఏర్పడిన ఎపిఎండిసి సంస్థను నిర్వీర్యం చేసి వారి లాభాల కోసం పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. 17 సంవత్సరాలుగా సమస్థ కోసం ఇల్లు, భూములు ఇచ్చిన నిర్వాసితుల కార్మికులను గతంలో మాయమాటలు చెప్పి వారి ఇల్లు, భూములు తీసుకుని వారిని రెగ్యులర్ చేయకుండా అవుట్ సోర్సింగ్, ట్రీనీ ఉద్యోగుల పేరుతో దోపిడి చేస్తున్నారని విమర్శించారు. అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను చట్ట ప్రకారం కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకుండా యాజమాన్యం నిలుపుదల చేయడం దుర్మార్గమైన చర్యని తెలిపారు. కార్మికులకు ఉపాధి కల్పించడానికి సిఅండ్డి కోటి టన్నుల నిలువలను ఏ గ్రేట్గా మార్చి బెనిఫికేషన్ ప్లాంట్ను వెంటనే ఎపిఎండిసి సంస్థ ఏర్పాటు చేసి సంస్థలో అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. చట్టం ప్రకారం ఇవ్వవలసిన గ్రాడ్యుటీ ఇవ్వకుండా చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వకుండా చనిపోయిన కార్మికుల కుటుంబాలకు డెత్ ఇన్సూరెన్స్ రూ.పది లక్షలు 8 మందికి చెల్లించకుండా పెండింగ్ మెడికల్ బిల్లులను చెల్లించకుండా మద్యపానం సేవించారని సమస్థ కాలంగా పక్కనపెట్టిన కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోకుండా ఎపిఎండిసి యాజమాన్యం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. త్వరగా సమస్యలు పరిష్కరించుకుంటే భవిష్యత్తు కార్యచరణ ప్రకటించి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 140 సంవత్సరాల క్రితం సాధించుకున్న ఎనిమిది గంటల పనిని 12 గంటల పనిగా చేయడం దుర్మార్గమన్నారు. ఫిబ్రవరిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఢిల్లీ రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో సిఐటియు జాతీయ మహాసభలు ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు ఐదు రోజులు పాటు జరుగుతాయని దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా ఉన్న కార్మిక నాయకులు పాల్గొంటారని తెలపారు. ఈ మహాసభలో ఎపిఎండిసి కార్మికుల సమస్యలపై తీర్మానం చేసి చర్చిస్తామని తెలపారు. ఎపిఎండిసి కార్మికులు సమస్త పరిరక్షణ కోసం, వారు చేసే పోరాటాలకు సిఐటియు రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ఇచ్చి వారి పోరాటంలో పాల్గొంటామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ మహాసభల జయప్రదానికి ప్రతి ఒక్క కార్మికుడు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులు, జెఎసి కో-కన్వీనర్ అరుణావతి, మంగంపేట మైనింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పుల్లగంటి శ్రీనివాసులు, ముత్యాల శ్రీనివాసులు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

గృహ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-పీలేరు

గృహ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. పీలేరులోని ఎపిఐఐసి లేఅవుట్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష జరిపి, వివిధ దశలలో ఉన్న గృహ నిర్మాణాలపై సమగ్రంగా వివరాలు సేకరించారు. హౌసింగ్ శాఖ అధికారులు కలెక్టరుకు గృహ నిర్మాణాల ప్రస్తుత స్థితిపై వివరిస్తూ లే అవుట్లో 1,118 ప్లాట్లు ఉన్నాయని, అందులో 662 గృహాలు మంజూరు చేశారని, వాటిలో 144 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన గృహాలు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయని కలెక్టరుకు వివరించారు. ఈ తనిఖీలో భాగంగా కలెక్టర్ నిర్మాణంలో ఉన్న గృహాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, దశల వారీగా నిర్మాణానికి అయ్యే ఖర్చు, ముడిసరుకు లభ్యత, మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల అందుబాటు, ప్రభుత్వ నిధుల మంజూరు, అధికారుల స్పందన వంటి అంశాలపై తెలుసుకున్నారు. ఇప్పటికే గృహాలు పూర్తిచేసుకుని నివాసం ఉన్న లబ్ధిదారుల అనుభవాలు, అవసరాలు, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణంలో సిమెంట్, ఇనుము వంటి నిర్మాణ సామగ్రి అవసరం మేరకు నాణ్యతతో వినియోగించేలా లబ్ధిదారులకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఆవాస్ ప్లస్ గృహ నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, సెంట్రింగ్ మెటీరియల్, ఇసుక లభ్యతను ముందుగానే నిర్ధారించాలని, భారీ స్థాయిలో గృహనిర్మాణం ఒకేసారి ప్రారంభమైనప్పుడు సమస్యలు తలెత్తకుండా ఇటుక తయారీని విస్తరించి, అవసరమైన పరిమాణంలో నిల్వలను సిద్ధం చేయాలన్నారు. నిర్మాణం పనులు పూర్తై నివాసమున్న లబ్ధిదారులకు మౌలిక వసతులను త్వరితగతిన సమకూర్చాలని మండల అభివృద్ధి అధికారి శివశంకర్ను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రమేష్రెడ్డి, తహశీల్దార్ శివకుమార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పకడ్బందీగా టెట్ పరీక్షలు

నేటి నుంచి 21 వరకు నిర్వహణ డిఆర్ఒ మధుసూదన్ రావు

ప్రజా శక్తి రాయచోటి

మాట్లాడుతున్న మధుసూదన్రావు

జిల్లాలో బుధవారం నుంచి ఈనెల 21 వరకు టెట్ (ఎపిటీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష పకడ్బందీగా నిర్వహించనున్నామని, ఇందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని డిఆర్ఒ మధుసూదన్రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం డిఆర్ఒ చాంబర్లో ఎపి టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాటాడుతూ టెట్ పరీక్షను ఈనెల 10 నుంచి 21 వరకు ఉంటుందని, ఇందుకోసం జిల్లాలో 4 కేంద్రాలను కేటాయించామని చెప్పారు. మదనపల్లిలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ 1798 మంది, అంగళ్లు సమీపంలోని మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో 200 మంది, రాయచోటి లోని శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ 1080 మంది, రాయచోటి లోని భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో 1845 మంది మొత్తం 4923 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కావడం జరుగుతుందని,టెట్ పరీక్ష ప్రతిరోజు రెండు సెషన్లలో నిర్వహించడం జరుగుతుందని, సెషన్ వన్ ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, సెషన్ 2 మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షలకు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా మదనపల్లిలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సెంటర్కు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె. ప్రభాకర్ రెడ్డి, మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల సెంటర్కు ఎంఇఒ కె.ద్వారకనాథ్, సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సెంటర్కు ఎం.బాలాజీ నాయక్, భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలకు పి. జయచంద్ర నియమించామని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లుగా డిప్యూటీ డిఇఒలు వై.లోకేశ్వర రెడ్డి, ఎల్. నాగయ్య, ఏడి బి.రవి కుమార్ ను నియమించామని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ ఎఇని, అభ్యర్థుల కోసం సరిపడ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టిసి అధికారులకు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పోలీస్ వారు బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రాలలో మెడికల్ అండ్ హెల్త్ వారు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలకు సంబంధించిన అధికారులు ఒక వాట్సాప్ గ్రూప్ను తయారు చేసి ఎప్పటికప్పుడూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని, ఆయా అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని టెట్ పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా డిఇఒ సుబ్రహ్మణ్యం, డిఎంహెచ్ఒ లక్ష్మీ నరసయ్య, ఉపవిద్యా శాఖ అధికారులు, ఎంఇఒలు, పోలీస్, ఎపిఎస్పిడిసిఎల్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం : 'ఆకేపాటి'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట

వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలన్న కూటమి ప్రభుత్వ ఆలోచన దుర్మార్గపు చర్య అని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ జరిగిందని, ప్రజలందరూ ముక్తకంఠంతో దీనిని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలోని ప్రజలు 70 వేల సంతకాలు చేసి తమ వ్యతిరేకతను చాటారని పేర్కొన్నారు. వైఎస్. రాజశేఖర్రెడ్డి హయాంలో మూడు వైద్య కళాశాలలు తీసుకొస్తే, జగన్మోహన్రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 12 కళాశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఒక్క వైద్య కళాశాల కూడా ఏర్పాటు చేయకపోగా ఉన్న కళాశాలలను చంద్రబాబు తన బినామీలకు కారు చౌకగా కట్టబెట్టేందుకు ప్రయివేటీకరణ అనే అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. వైద్య కళాశాలలు ప్రయివేటుపరం చేస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులు, ప్రజలకు వైద్య విద్యతో పాటు వైద్యం కూడా అందనంత దూరానికి వెళ్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను గౌరవించి వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని కోరారు. సేకరించిన సంతకాల ప్రతులను బుధవారం ఆర్అండ్బి అతిథి గృహం వద్ద నుంచి జండా ఊపి జిల్లా కేంద్రానికి తరలించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాధ రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ దండు గోపి, జడ్పిటిసి దాసరి పెంచలయ్య పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి అధినేత జగన్మోహన్రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణకు నియోజకవర్గంలో విశేష స్పందన లభించడంతో సూపర్ సక్సెస్ అయిందని వైసిపి సమన్వయకర్త నిసార్ అహమ్మద్ పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ద్వారానే వైద్య విద్య లభిస్తుందనే గట్టి నమ్మకం జగన్మోహన్రెడ్డిదన్నారు. నియోజకవర్గంలో 50 వేలు సంతకాలు పూర్తి అయ్యాయని తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైసిపి నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 ఔషద నియంత్రణ తనిఖీ కేంద్రాలు, 2 ల్యాబ్లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విజయవాడ నుంచి వర్చువల్గా ప్రారంభించారు. మదనపల్లె ఔషధ నియంత్రణ తనిఖీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఇన్ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కవిత, డ్రగ్స్ నియంత్రణ కేంద్రం అడిషనల్ డైరెక్టర్ షేక్ ఆశా, మదనపల్లె డ్రగ్ ఇన్స్పెక్టర్ దాదా కళందర్, అనంతపురం డ్రగ్ ఇన్స్పెక్టర్ కేశవరెడ్డి హాజరయ్యారు. ఉదయం మంత్రి వర్చువల్గా ప్రారంభించిన సమయంలో శిలాఫలకం వద్ద ఔషద తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మదనపల్లె మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ, మదనపల్లె అధ్యక్షులు భూషణ్ గుప్త, మదనపల్లె సెక్రెటరీ శ్రీధర్, కోశాధికారి బాలాజి, సభ్యులు మురళి, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

బిఎల్ఒ విధుల్లో పనిభారాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : సచివాలయ ఉద్యోగులకు బిఎల్ఒ విధులలో పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ గ్రామవార్డు సచివాలయం ఉద్యోగుల జేఎసీ ఆధ్వర్యంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ గుడి నాగరాజు మాట్లాడుతూ బిఎల్ఒ విధులలో తీవ్ర ఒత్తిడి కారణంగా నలుగురు ఉద్యోగులు ఆత్మహత్యకు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం సచివాలయం ఉద్యోగులను బీఎల్ఓలుగా నియమించడం వలన తమ విధులతో పాటు బిఎల్ఒలుగా విధులు ఒత్తిడి కారణంగా మనోవేదన చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు లీలావతి, వినోద్ కుమార్, ఆనంద్, పావని తదితర సచివాలయ ఉద్యగులు పాల్గొన్నారు.

'పది' మాదిరి ప్రశ్నపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-పీలేరు: యుటిఎఫ్ పీలేరు మండల శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్ను ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో డివైఇఒ వై.లోకేశ్వర్ రెడ్డి చేతులు మీదుగా వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఉచితంగా వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్.శివారెడ్డి, జిల్లా కార్యదర్శి అక్రంబాష, మండల గౌరవాధ్యక్షులు కె.రెడ్డప్ప, అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, జి.భాస్కర్, కిషోర్ కుమార్రెడ్డి, మస్తాన్, కృష్ణమూర్తి, శెట్టి సుబ్రహ్మణ్యం, కె.కె.ప్రసాద్, పాల్గొన్నారు.

కాంగ్రెస్తోనే దేశాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యమని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెడ్డి సాహెబ్ అధ్యక్షతన సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ గడిచిన రెండు దశాబ్దాలుగా భారత దేశంలో కాంగ్రెస్ పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించిన నాయకురాలన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా సోనియా గాంధీ దేశానికి ఎనలేని సేవలు అందించారని, ఇందిరమ్మ వారసత్వాన్ని పునికిపుచ్చుకుని ఆమె ఆశయ సాధనకై ఎంతో కృషి చేసిన గొప్ప దేశ భక్తురాలు సోనియాగాంధీ అని గుర్తుచేశారు. ఎన్డిఎ పాలనంత ప్రయివేటు సంస్థలకు తొత్తుగా సాగుతూ, ప్రభుత్వ ఆర్థిక మూలాలను దెబ్బతీయడం తప్ప దేశాన్ని అభివృద్ధి చేసింది ఏమి లేదని విమర్శించారు. దేశంలో ఇండిగో విమానయాన సంస్థ ద్వారా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీనా కుమారి, మహబూబ్ పీర్, శరత్ కుమార్ రెడ్డి, ఈశ్వరమ్మ, రవీంద్ర, మహమ్మద్, పాలేటి, నాగరాజు, హబీబ్, అల్లాబక్షు, సమీర్, విజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కాలనీలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని స్థానిక అగర్వాల్ నేత్రాలయం సిబ్బంది సహాయంతో ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.వెంకట నరసయ్య మాట్లాడుతూ మన శరీరంలో అత్యంత ప్రధానమైనవి నేత్రాలే అని, వాటికి ఏ చిన్న సమస్య వచ్చినా ఎప్పటికప్పుడు పరీక్ష చేయించుకోవాలని, కళ్ళకు ఎలాంటి గాయాలు కాకుండా చూసుకోవాలని, ముఖ్యంగా ఊబకాయం రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఊబకాయం మధుమేహానికి దారితీస్తుందని ఫలితంగా నేత్రాలు దెబ్బతిని చూపు తగ్గిపోతుందని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

త్వరగా రహదారి పనులను పూర్తి చేయాలి : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

అసంపూర్తిగా ఉన్న రాయచోటి-సుండుపల్లి రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్బి శాఖ అధికారులను ఆదేశిస్తూ రవాణా, క్రీడల, యువజన శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం ఓ లేఖ రాశారు. రాయచోటి-సుండుపల్లి మధ్య ప్రయాణించే ప్రజలు రోడ్డు అసంపూర్తి కారణంగా తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని వారి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ మార్గంపై ఆధారపడిన విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, రోగులకు రోజువారీ ప్రయాణం కష్టంగా మారిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని. నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి, రోడ్డును వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలని మంత్రి రాంప్రసాద్ సూచించారు.

సమష్టి కృషితో ఎయిడ్స్ను నివారిద్దాం

ప్రజాశక్తి - రాయచోటి: ఎయిడ్స్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ సమష్టిగా భాగస్వామ్యం కావాలని క్లస్టర్ ప్రోగ్రాం ఎయిడ్స్ నియంత్రణ అధికారి భాస్కర్, రాష్ట్ర ప్రివెన్షన్ ఆఫీసర్ బాబు క్లస్టర్ ప్రివెన్షన్ అధికారి ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటిలో ప్రజా చైతన్య సేవా సంఘం కార్యాలయాన్ని క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వేంపల్లి భాస్కర్, క్లస్టర్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనంద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాక్కు సంబంధించిన ఫార్మాట్లు, పత్రాలు, నిర్వహణ కార్యక్రమాలను విభాగాలవారీగా సమీక్ష చేసి సూచనలు అందించారు. అనంతరం రాయచోటి ఏరియా ఆసుపత్రిలోని ఐసిటిసి కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి ధృవీకరించారు. నెలవారీ నివేదికల్లో ఏవైనా వ్యత్యాసాలు ఉన్న వెంటనే సరి చేసుకోవాలని పేర్కొన్నారు. హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన సపోర్ట్ మెకానిజం అందజేయడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించి, వారి పనితీరు, నివేదికల నాణ్యతపై చర్చించి తగిన సూచనలు, మార్గనిర్దేశం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్: ఎంతోకాలం నుంచి పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా నేతలు డిఇఒ సుబ్రమణ్యంకు విన్నవించారు. మంగళవారం సాయంత్రం బిటిఎ జిల్లా అధ్యక్షులు పల్లం రామచంద్ర, సహాధ్యక్షులు ఎ.వి.రమణ, ఉపాధ్యక్షులు జి.అశోక్ కుమార్, రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ షేక్ అబ్దుల్ రజాక్ డిఇఒను కలిసి సమస్యను విన్నవించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 342 ప్రకారం ఎస్సి, ఎస్జిటి ఉపాధ్యాయులు తదుపరి ఉద్యోగోన్నతుల కోసం చేసే బిఇడి కోర్సుకు అవగాహనా లేమితో అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదనే నెపంతో వారి అడ్మిషన్ నిలుపుదల చేయకుండా అనుమతించాలన్నారు. గత సంవత్సరం పదవ తరగతి మూల్యాంకన విధులలో పాల్గొన్న కందరి ఉపాధ్యాయులకు పారితోషకం వారి ఖాతాల్లో ఇంకా డబ్బులు జమ కాలేదని, వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని కోరారు. పదవ తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో విద్యార్థుల పరీక్ష పేపర్ల మూల్యాంకనానికి తగినంత సమయం ఇవ్వాలని పేర్కొన్నారు. సాధారణ, పండుగ సెలవులలోనూ తరగతుల నిర్వహణ మినహాయించి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు.

మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ ఫయాజ్బాషా

వీధికుక్కల నియంత్రణపై తక్షణమే చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

పట్టణంలో విచ్చలవిడిగా స్వేర విహారం చేస్తున్న వీధి కుక్కల నియంత్రణకు అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్బాషా అధికారులను కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా స్కూటరిస్టులు, పాదచారులపై దాడులకు దిగి గాయపరుస్తున్నాయన్నారు. అధికారులు కుక్కలు కట్టడికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పట్టణంలో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తోడ్పాటునివ్వాలని పేర్కొన్నారు. మున్సిపల్ పార్క్ వర్గం, అధికారులు సమిష్టి కృషితోనే మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయని స్తుందన్నారు. అనంతరం పలు అభివృద్ధి అంశాలపై ఆయన అధికారులతో చర్చించి సలహాలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఆయనతో పాటు కౌన్సిలర్ షబ్బీర్, మున్సిపల్ కమిషనర్ రవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాజంపేట

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.హరిప్రసాద్ కోరారు. మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సబ్ కలెక్టర్ హెచ్.ఎస్ భావనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి 2010కి ముందు నియామకం జరిగిన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23కు సవరణ చేయాలని కోరారు. సర్వీస్లో ఉన్న ఉపాధ్యాయులు రెండు సంవత్సరాల లోపు టీచర్ టెట్ పాస్ కావాలని, లేకుంటే సర్వీస్ నుండి తొలగించాలని సుప్రీం కోర్టు 2025 సెప్టెంబరు 1న తీర్పు వెలువరించిందని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రాస్పెక్టివ్గా కాకుండా రెట్రాస్పెక్టివ్గా వర్తించే విధంగా ఉన్నందున రాష్ట్రంలో దాదాపు లక్ష మంది ఉపాధ్యాయుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టంలో తగిన సవరణలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, రమణమూర్తి, మండల అధ్యక్షులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి శివయ్య, ఉపాధ్యాయులు వినోద్ కుమార్, మాధవ్ మూర్తి, వెంకటరమణ, సాంబశివరావు, శివకుమార్, పోలయ్య, సుధాకర్, కృష్ణ, శ్రీనివాసులు, సురేంద్ర వర్మ, సుబ్బరాజు, నాగరాజు, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్కు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిల్లల ఎదుగుదలలో ఐసిడిఎస్ పాత్ర కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పిల్లల పోషణ, ఎదుగుదల, ఆరోగ్య ఫలితాలను మెరుగు పరచడానికి ఐసిడిఎస్ శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సిడిపిఒ, సూపర్వైజర్లను కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని బాల సంజీవిని డిస్ట్రిబ్యూషన్, గ్రోత్ రిపోర్ట్ పోషన్ ట్రాకర్, పిఇఎస్ హాజరు, బిఎస్కిట్, తదితర అంశాలపై సిడిపిఒలు, సూపర్వైజర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్యా, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాలు స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందో తెలుసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు ఎన్నో వేల కోట్ల రూపాయలతో పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేస్తోందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వల్ల దేశ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఐసిడిఎస్ సిబ్బంది కిట్స్ పంపిణీ చేయడం మాత్రమే కాకుండా ఫలితాల ఆధారిత పనితీరుపై దృష్టి సారించాలని చెప్పారు. కిట్స్ పంపిణీ తర్వాత హిమోగ్లోబిన్ పెరిగిందా లేదా, హైట్ గ్రోత్,వెయిట్ గ్రోత్ వచ్చాయా లేదా అనే విషయాన్ని గమనించి వారికి కావాల్సిన సలహాలు సూచనలు అందివ్వాలని అన్నారు. గర్భిణులలో హిమోగ్లోబిన్ తగ్గుదలలో పీలేరు, బొమ్మనుచెరువు, వైకోట, కలకడ కేంద్రాలలో ఎక్కువగా ఉన్నాయని పురోగతి సాధించాలని అన్నారు. ఈ అంశంపై ఐసిడిఎస్ పీడీ రోజూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అండర్ వెయిట్లో వాల్మీకిపురం, చిట్వేల్, బి.కొత్తకోట తదితర ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయని, వాటిలో పురోగతి సాధించాలన్నారు. రాష్ట్రంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అన్నింటిలో మెరుగైన ఫలితాలు సాధించి, మెరుగైన స్థానాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ హైమవతి, జిల్లా లోని సిడిపిఒలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట చేపట్టిన పారిశుధ్య పనులు చూపుతున్న సర్పంచ్

వై.కోటలో చెత్త తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పుల్లంపేట

వై.కోటలో మంగళవారం పంచాయితీ అధికారులు పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. ఆదివారం 'వై.కోటలో లోపించిన పారిశుధ్యం' అనే శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన వార్తకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ విజయరావు స్పందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న చెత్తతో పాటు మేజర్ పంచాయతీ అయిన వై.కోటలో గ్రామ గ్రామాన పేరుకుపోయిన చెత్తను తొలగించారు. బ్లీచింగ్ చల్లి ఈగలు, దోమల నివారణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర య్య, పంచాయతీ కార్యదర్శి గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్‌శాఖ పీలేరు డిఇ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీలేరు డివిజన్‌లోని పలు పాఠశాలల నుంచి 200మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరికి ఇంధన పొదుపుపై క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఇంధన పొదుపు, సూర్యఘర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో డిపి డిఇ దామోదర్, ఎడిఇ అహ్మద్‌బాషా, ఎఇఒఇలు సురేష్‌కుమార్, నాగార్జున, వాల్మీక పురం ఎంపిడిఒ మనోహర్‌రాజు, ఎంజెపిఎపి పాఠశాల ప్రిన్సిపల్ సోమ శేఖర్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎఇలు ముజిబుర్ రెహ మాన్, ఖాదర్ ఇలాహి, అరున్, రాజశేఖర్, వరప్రసాద్, జెఇలు, గోవర్ధన్, జాకీర్ హుస్సేన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు లైన్ మెన్లు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

అయ్యప్ప దీక్షా పరులకు అన్నదానం చేయడం మనసుకు సంతోషాన్ని ఇస్తుందని లక్కిరె డ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధురై లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధిరేవుల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం లోని హరిహరాలయంలో మంగళ వారం అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న భక్తులకు రమేష్‌రెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డి పేరుతో అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిని రవికుమార్‌రెడ్డి, జగన్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు..

వీరబల్లి : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని రాష్ట్ర ఎంపిపిల సంఘం ఉపాధ్యక్షులు రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పిఎంఎస్‌ఎంఎ కార్యక్రమంలో భాగంగా పరీక్షల నిమిత్తం మండల నలుమూలల నుంచి వచ్చిన గర్భిణులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 46 నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ వైద్య పరీక్షల నిమిత్తం, వైద్య సేవలు నిమిత్తం వచ్చే గర్భిణులకు భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ మనిషా మాట్లాడుతూ ప్రతినెల ఒకసారి గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన ఏ సమస్య వచ్చిన సమస్య తీర్చడానికి ముందుంటారని చెప్పారు. ఆస్పత్రికి 50 కుర్చీలు వితరణగా ఇచ్చారని, ఆసుపత్రిలో నీటి సమస్య వచ్చినప్పుడు బోరు, మోటర్ అందించారని ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వాల్మీకులను నట్టేట ముంచకండి

పొదల నరసింహులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : నమ్మి ఓట్లేసిన వాల్మీకులను నట్టేట ముంచొద్దని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాల్మీకి, బోయలకు ఎన్నికలముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టుకోవాలన్నారు. గిరిజనుల రిజర్వేషన్ విషయంలో ఏజాతికి లేని ఈ అశాస్త్రీయమైన నిబంధన వాల్మీకి బోయలు రిజర్వేషన్‌లో మాత్రమే ఎందుకని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని అనుసరించి అధికరణ 14, 15, 16, 29/1, 342 లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో వాల్మీకి బోయలు ఎస్‌సి, ఎస్‌టిలుగా కొనసాగు తున్నారని, కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే బిసి-ఎ లుగా ఉన్నా రన్నారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్‌టిలుగా మైదాన ప్రాంతాల్లో బిసిలుగా కొనసాగడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్ప టికైనా వాల్మీకుల మధ్య ఉన్న ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించి కూటమి ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి ఒకే జాతి, ఒకే ఎస్‌టి రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువతను చైతన్యం చేస్తూ, ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆర్.ఓ.సి.నెం.: 1146/ఎ1/2011

మదనపల్లె పురపాలక సంఘము

తేది:09.12.2025

6 వ టెండర్ కమ్ అక్షన్ నోటీసు

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ షాపింగ్ కాంప్లెక్స్ నందు క్రింద తెలిపిన ఖాళీగా G.O.MS.No.68 (MA&UD) 31.05.2024, అద్దెపై లీజుకు ఇచ్చుటకు ది: 18-12-2025 తేదిన TENDER CUM AUCTION కార్యక్రమములో భాగం గా టెండరు నిర్వహించబడును. కావున సదరు TENDER CUM AUCTION నందు పాల్గొనదలచిన వారు ది: 18-12-2025 లోగ టెండరు రుసుము రూ. 100/-లను మున్సిపల్ ఖజానాలో చెల్లించి, మదనపల్లె పురపాలక సంఘం చే జారీ చేయబడిన టెండరు షెడ్యూలును ది: 18-12-2025 వ తేది మధ్యహ్నం 3:00 గం॥లు లోగా దాఖలు చేయవలెను. టెండరు దాఖలు పరిచిన తదుపరి, టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరచి అదే రోజు బహిరంగ వేలము నిర్వహించబడును. ఒకటికన్న ఎక్కువ షాపు రూములు కావలసిన వారు ఒక్కొక్క షాపుకు ఒక్కొక్క టి విడివిడిగా టెండరు దాఖలు చేయవలెను.

వ.సం.	ఏరియా/కాంప్లెక్స్	మొత్తం	ఖాళీగా ఉన్న షాపురూము నెంబర్లు
1.	జి.కె. వీధి	18	6,11, 23, 27, 27A, 28A, 29, 29, 30, 31, 33 (SC), 33A (SC), 34, 35, 36, 37, 39, 40
2.	ముగ్గురాళ్లవంక	10	32, 34, 37, 38, 44, 45, 51, 53, 63, 64
3.	చిత్తూరు బస్టాండ్	19	8(ST), 9(PH), 10, 11, 15, 16(SC), 17, 18, 19, 20, 22(SC), 24, 26, 27(SC), 28, 29, 30, 33(PH), Toilet rooms
4.	బెంగుళూరు బస్టాండ్	05	35A, 36A, 38A, 40(SC), 46A (SC)
5.	కో-ఆఫ్ కాలనీ	06	5,06,08,09(ST),10,11(SC)
6.	సుభాష్ రోడ్డు	01	6106,08,09(ST),10,11(SC)
7.	కొత్తగా నిర్మించిన చిత్తూరు బస్టాండ్	01	03
	మొత్తం	60	

షరతులు:
1. దిగువ షాపు రూములు సాల్వెన్సి రూ॥ 100000/-లు మరియు రూ॥ 50000/- లకు ధరావత్తును, కమీషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడువు) సమర్పించవలెను.
2. మొదటి అంతస్తు షాపు రూములు సాల్వెన్సి రూ॥ 50000/-లు మరియు రూ॥ 25000/- లకు ధరావత్తును, కమీషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడువు) సమర్పించవలెను.
3. టెండరు ఫారము పై నెలసరి అద్దెను స్పష్టముగా అంకెలులోను మరియు అక్షరములోను తప్పనిసరిగా వ్రాయవలెను.
4. నెలసరి అద్దెపై ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు 18% శాతం GST అధనముగా చెల్లించవలసియుండును.
ఇతర వివరములు, షరతులు కార్యాలయ పనివేళయందు A1 వారిని సంప్రదించవచ్చును.

కమీషనరు
మదనపల్లె పురపాలక సంఘము

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన కూరగాయల స్టాల్ ను ఏర్పాటు చేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ స్టాళ్లకు ప్రజలనుండి విశేష ఆదరణ లభిస్తోందని, కలెక్టరేట్‌తో పాటు 30 మండలాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్ల ద్వారా మొత్తం 67 మెట్రిక్ టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు విక్రయమై రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు డిపిఎం వెంకటమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రసాయన రహిత, ఆరోగ్యకర ఆహారం వినియోగదారులకు అందించడంతో పాటు, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్న రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తోందన్నారు. మార్కెటింగ్ ఇన్‌చార్జ్ డి.పవన్ మాట్లాడుతూ రైతుల శ్రద్ధ, ప్రజల నమ్మకం వల్ల ఈ సంవత్సరం అమ్మకాలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. మార్కెటింగ్ సిబ్బంది పవన్, పద్మావతి, రవీంద్ర గౌడ్ సమన్వయంతో మండలాలవ్యాప్తంగా స్టాళ్ల నిర్వహణ సజావుగా సాగుతోందని,రాబోయే సంవత్సరంలో ఉత్పత్తుల పరిమాణం, స్టాళ్ల విస్తరణను పెంచి మరింత మంది రైతులకు మార్కెట్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

పిహెచ్‌సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

జాతీయ స్థాయి క్రీడలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-సుండుపల్లి

ఎస్‌జిఎఫ్‌ఐ జాతీయ స్థాయిలో నిర్వహించే బేస్‌బాల్, సాఫ్ట్ బాల్ క్రీడలకు మండల కేంద్రమైన సుండుపల్లె జడ్‌పి హైస్కూల్, జూనియర్ కళాశా లకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఢిల్లీ, మహారాష్ట్ర రాష్ట్రం లోని నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్, సాఫ్ట్ బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని జడ్‌పి హైస్కూల్‌లో గత నెల 29నుంచి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన అండర్-14 బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో జడ్‌పి హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న కోసిక నాగ చైతన్య ఎంపికైంది. గుంటూరు జిల్లా, చుండూరు మండలం, మోదకూరు వేమన జడ్‌పి హైస్కూ ల్‌లో ఈనెల 6నుంచి 8వతేది వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 బాలుర, బాలికల సాఫ్ట్ బాల్ పోటీలలో సుండుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు తమ సత్తా చాటి జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. సాఫ్ట్ బాల్ అండర్-19బాలికల విభాగంలో జడ్‌పి హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సం వత్సరం చదువుతున్న బాలికల విభాగంలో నంద్యాల బేబి, బాలుర విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.వెంకటేశ్వర్లు, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఈ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో వివిధ జిల్లాల మధ్య జరిగిన పోటీలలో సత్తా చాటి బెస్ట్ క్యాచర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా వెంకటేశ్వర్లు ఎంపికయినట్లు పాఠశాల పీడీ రాధారాణి తెలి పారు. అండర్-14, అండర్-19 బేస్‌బాల్, సాఫ్ట్ బాల్ జిల్లా రాష్ట్ర స్థాయి పోటీలు, సెలెక్షన్స్ లలో నాగ చైతన్య, నంద్యాల బేబి, వెంకటేశ్వర్లు ఉత్తమ ప్రతిభ కనబ రచి జట్ల ఎంపికలో కీలకమైన సెలెక్టర్లను ఆకట్టుకుని జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో పీడీ

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని వివిధ అనారోగ్యాల కారణంగా ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి టిడిపి యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డితో కలిసి బాధితులకు అందించారు. పుల్లంపేట పట్టణానికి చెందిన మచ్చి కంటి పట్టిక కృష్ణ మచ్చికంటి మాధవికి రూ.30,786, అనంతయ్యగారిపల్లి కాలనీకి చెందిన బొమ్మ ప్రభావతిరెడ్డికి రూ.43వేలు, కొత్తపేట గ్రామానికి చెందిన పుత్తూరు సుబ్బమ్మకి రూ.33,800లు, టి.కమ్మపల్లి పంచాయతీ బలిజపల్లె దళితవాడకు చెందిన గోపదాల హరినాథ్ మరణించడంతో వాళ్ల కుటుంబ సభ్యురాలు అందే మల్లీశ్వరికి రూ.30,785లు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సాతువారిపల్లి ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి పిల్లలకు అందుతున్న వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం బాగాలేని సమయంలో బాధితులకు కూటమి ప్రభుత్వం ఆసరాగా ఉంటోందన్నారు. నియోజకవర్గ అబి. వృద్ధికి శాయశక్తుల కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పోలీ జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నం శివయ్య, కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

హైవే రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రం పుల్లంపేట ఆదర్శ పాఠశాల నుంచి రేణిగుంట వరకు నేషనల్ హైవే 716 రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కూడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, సాయి లోకేష్ మంగళవారం హైవే రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నత్తనడకన సాగుతున్న కడప రేణిగుంట నేషనల్ హైవే నిర్మాణంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కారితో చర్చించి రూ.90 కోట్ల నిధులను తక్షణమే మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. నేషనల్ హైవే విస్తరణ, అభివృద్ధి వల్ల రైల్వేకోడూరు రాజంపేట మార్గాల్లో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. ఈ రహదారి పూర్తి అవడం ద్వారా స్థానికుల ప్రయాణం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి హెూలీ జగదీశ్వర్‌రెడ్డి, ఆరే సుధాకర్ నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన నాగూర్‌వలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రాష్ట్ర రోడ్డు రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసా ద్‌రెడ్డి, మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డిఫరూక్‌ను మదనపల్లె ఎపిఎస్‌ఆర్‌టిసి 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్‌వలి మంగళవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగూర్‌వలి మాట్లాడుతూ మంత్రులు తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారన్నారు. ఆర్‌టిసి ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం, డిపోలలో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను మంత్రి మండిపల్లి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఆర్‌టిసి బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారని పేర్కొన్నారు.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

మహారాజశ్రీ రాజంపేట సివిల్ జడ్జి జూనియర్ డివిజన్
O.S. NO : 61/2020
మాడెం శశి కుమార్ రెడ్డి రిప్రజెంట్ బై G.P.A holder D.బ్రహ్మానంద రెడ్డి ...వాది
V/S
మేడా కుమార్ రెడ్డి died his legal hiers (D2)
మేడా పార్వతమ్మ, w/o కుమార్ రెడ్డి -D3
మేడా గిరిధర్ రెడ్డి s/o కుమార్ రెడ్డి-D4
మేడా మురళి రెడ్డి s/o కుమార్ రెడ్డి-D6
అందరిదీ గాలివారిపల్లి (v & p), రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా.
వాది మీ పైన దావా దాఖలు చేసినందున, మేడా కుమార్ రెడ్డి చనిపోయినందున ఆయన వారసులుగా %ఙ3, ఙ4, ఙ%6 గా చేర్చినందున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో రాజంపేట సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కోర్టులో 15-12-2025 వ తేదీ ఉదయం 10:30 గంటలకు హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో శ్రీ కోర్టు వారు మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
//By order of the court//
G.రామచంద్ర, B. Com., B.L..,
అడ్వకేట్, రాజంపేట.
సెల్ : 98483 20954.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రక్తదానం ప్రాణదానంతో సమానమని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరు నగరం,ఎం.ఎస్ రామయ్య ఆసుపత్రిలో ప్రసవం కోసం ఓ గర్భిణీకి రక్తం అవసరం కాగా వారి కుటుంబ సభ్యులు మా ఫౌండేషన్ ని ఆశ్రయించారన్నారు. ఫౌండేషన్ సభ్యులు మహేష్, శివకుమార్లు గర్భిణి చికిత్సకు అవసరమైన రక్తాన్ని అందించారన్నారు. విపత్కర పరిస్థితిల్లో వైద్యానికి అవసరమైన రక్తాన్ని బాధితులకు అందజేస్తూ మా ఫౌండేషన్ సభ్యులు మానవత్వాన్ని చాటుకుంటున్నారన్నారు.తమ ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటారని ప్రశంసించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం : భారతదేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ భారత చట్టాలు బాధ్యతలు హక్కులపై అవగాహన పెంచుకోవాలని లక్కిరెడ్డిపల్లె సిఐ కొండారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ గ్రామ సచివాలయంలో మంగళవారం గ్రామ ప్రజ లకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి చట్టాలు ఉన్నాయి, ఎస్‌సి, ఎస్‌టిలకు భారత రాజ్యాంగం కల్పిం చిన హక్కుల గురించి వివరించి చెప్పారు. దళితులను అంటరాని వారిగా చూస్తే ఎలాంటి చట్టాలు వర్తిస్తాయో తెలుసు కో వాల న్నారు. చిన్నపిల్లల చేత పనులు చేస్తే వర్తించే చట్టాలు చిన్న వయసులోనే వివాహాలు చేస్తే ఎలాంటి చట్టాలు వర్తి స్తాయో తెలియజేశారు. గ్రామాలలో కోడిపందాలు, జూదం ఆడే వారికి ఎలాంటి శిక్షలు పడతాయో చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ శివకుమార్, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.

దిత్వా తుపాన్ ప్రభావంతో కూలిన ఇల్లు

ప్రజాశక్తి-చిన్నమండెం

కూలిన ఇల్లు

చిన్నమండెం మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం, రాజుల కాలనీలో ఓదేటి రమణయ్య నివాసమున్న ఇల్లు ఇటీవల కురిసిన దిత్వా తుపాన్ ప్రభానికి నానిపోయింది. గోడలు నాని పోయి ఉండటంతో మంగళవారం తెల్లవారుజామున ఇంటికి రెండు వైపులా ఉన్నటువంటి గోడలు కూలి పోయాయి. తెల్లవారుజామున 5 గంటలకు ఇంటి అందరూ నిద్రిస్తున్నామని రమణయ్య తెలిపారు. గోడలు వెలుపల వైపుకు పడడంతో ప్రమాదం నుంచి బయటపడ్డామని తెలిపారు. ప్రభుత్వం సాయం అందించాలని కోరారు.

దళితుల భూములను కాపాడాలి

ప్రజాశక్తి-కలికిరి : దళితుల భూములను కాపాడాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమల సుదర్శన్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ సిఐ రామచంద్రను మర్యాదపూర్వ కలిసి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలికిరి మండలంలో దళితుల భూములను నకిలీ పత్రాలు సృష్టించి రెవెన్యూ అధికారుల సాయంతో ఆన్‌లైన్ చేసుకొన్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డిని సంఘం తరపున కలిసి దళిత భూవ ఖలను, భూ కబ్జాదారులు ఆక్రమిం చుకున్న భూము లను తిరిగి స్వాధీన పర చాలని కోరుతామని చెప్పారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి విహారి, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు యమల చంద్రయ్య, జిల్లా అధ్యక్షులు మల్లెల మోహన, జిల్లా ఉపాధ్యక్షులు మనోహర, ఎన్‌టి రమణ, సహదేవయ్య, సురేష్, శ్యామ్, విజయ్, పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినవి

డాక్యుమెంట్ తప్పిపోయినది గాలివీడు మండలం గోరాన్ చెరువు పంచాయతీ సర్వేనెంబర్ 891/2ఏ నందు మూడు ఎకరాల 9 సెంట్లు భూమికి సంబంధించిన డాక్యుమెంట్ మలసాని వెంకటసుబ్బారెడ్డి తండ్రి ఎం. కసిరెడ్డి అను నేను డాక్యుమెంట్ నెంబర్.1610/ 1991 కే. పార్వతమ్మ, కే.చిన్నపరెడ్డి, కె బాబ్జీ రెడ్డి, కే. శివారెడ్డి అను వారి నుంచి 28- 08- 1991న కొనుగోలు చేయడం జరిగినది. మలసాని. వెంకటసుబ్బారెడ్డి అను నేను డాక్యుమెంట్ చేత పట్టుకొని రాయచోటికి తన సొంత పని నిమిత్తము బయలుదేరి పోయాను. బస్సు దిగే సమయంలో రద్దీ లో ప్రయాణికులు అధికంగా ఉండడంతో చేతిలో ఉన్నా ఫైల్ జారిపోవడంతో డంతో ఆ ఫైల్ లో ఉన్న డాక్యుమెంట్ 1610/ 1991 డాక్యుమెంట్ కనిపించడం లేదు. ఎవరికన్నా దొరికిన కింది నెంబర్ కు ఫోన్ చేయగలరు **9440586474**

మాట్లాడుతున్న రెడ్డెయ్య

ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-చిన్నమండెం

జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలో ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామని టిడిపి మండల అధ్యక్షుడు మూగి రెడ్డెయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఎంపిడిఒ, సచివాలయ అధికారులు, గ్రామ టిడిపి అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, గ్రామ కమిటీ నాయకులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. పెండింగ్‌లో ఉన్న శ్రీనివాసపురం రిజర్వాయర్ పూర్తి చేసి సాగు నీరు అందించడానికి అని రకాల చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటికి జల జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించి శాశ్వత పరిష్కార పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధితో పాటు ధూప దీప నైవేద్యం కింద నిధులు కేటాయించిన ఘనత మన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రోడ్లు, డ్రెయినేజీ మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి హౌసింగ్ ద్వారా ఇంటి నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసేలా అధికారులను కోరారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ చెన్నకృష్ణ రెడ్డి, మండల్ సెక్రటరీ ఖాదర్ బాషా గ్రామ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, చిన్న రెడ్డి, అశోక్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

వీధుల్లో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న మౌర్యరెడ్డి

పట్టణ శుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి పారిశుధ్య చర్యలను మెరుగు పరచాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మేనల్లుడు మౌర్యారెడ్డి మున్సిపల్ అధికారులను కోరారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులలో ఆయన మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి, టిడిపి శ్రేణితో కలిసి పర్యటించారు. పలు వార్డులలోని ప్రజలతో మాట్లాడి వీధులను నిత్యం శుభ్రపరుస్తున్నారా, డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపల్ కార్మికులకు అందించాలని కోరారు. పట్టణంలో రోజురోజుకు పేట్రెగిపో తున్న వీధి కుక్కలను వెంటనే కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలంటూ ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్య క్రమంలో టిడిపి నేతలు లయన్ మహమ్మద్, యూత్ గంగిరెడ్డి, సాంబరెడ్డి, అగ్రో సూరి, రాజారెడ్డి ఈశ్వరయ్య ,జంగంరెడ్డి, వేణు, హాజీలతో పాటు పలువురు మున్సిపల్ , సచివాలయాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-సుండుపల్లి : టిడిపి మండల అధ్యక్షులు రమేష్ నాయుడును, ఆయన సోదరుడు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు మంగళవారం స్థానిక టిడిపి నాయకులు కంచన రెడ్డయ్య దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో మండలంలోని అభివృద్ధి చెందుతుందన్నారు. మండలంలో 14 గ్రామపంచాయతీలో కమిటీలు ఏర్పాటు చేసి అభివృద్ధికి అభివృద్ధి జరిగే విధంగా చూస్తున్నారని అన్నారు.సుండుపల్లి గ్రామపంచాయతీలో తాగునీటిని ట్యాంకర్లను శుభ్రం చేయించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజా, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడుతో కంచన రెడ్డెయ్య

పోలీసు వాహనం ఢీకొని సివిల్ ఇంజినీర్‌కు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ద్విచక్ర వాహనంలో వెళ్తున్న సివిల్ ఇంజినీర్‌ను పోలీసు వాహ నం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు..కలకడ మండలం, కోన పంచాయతీ, ఎల్లంగుడిబండకు చెందిన వినయ్‌కుమార్ సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మదనపల్లెలో నిర్మిస్తున్న భవనాలను పర్యవేక్షిం చేందుకు బైక్‌లో మదనపల్లెకు బయలుదేరాడు. మదనపల్లెకు చెందిన పోలీసు వాహనం కడపకు వైపు వెళుతుం డగా మార్గ మధ్యంలోని గుర్రంకొండ మండలం, సూరప్పగారిపల్లె వద్ద ఎదు రుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సివిల్ ఇంజినీర్ వినయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వాహనంలో ఉన్న పోలీసులు వెంటనే బాధితుడిని 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రిఫర్ చేశారు. గుర్రంకొండ పోలీసులు విచారణ చేస్తున్నారు.

సెల్ టవర్ ఎక్కిన డ్వాక్రా మహిళ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : మండల కేంద్రం నిమ్మనపల్లెలో ఓ డ్వాక్రా మహిళ మంగళవారం మధ్యాహ్నం సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన నిమ్మనపల్లి పట్టణానికి చెందిన షేక్ రియాజ్ భార్య షేక్ ఫర్జానా మహిళా సమాఖ్యలోని డ్వాక్రా సంఘంలో బిందు గ్రూపులో సభ్యురాలుగా ఉన్నానని తెలిపారు. తాను ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికురాలిగాను, ఇళ్లల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని చెప్పారు. డ్వాక్రా సంఘంలోని తన గ్రూపు సభ్యులతో కలిసి గత ఏడాది అక్టోబర్ నెలలో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1లక్ష రుణం తీసుకున్నట్లు చెప్పారు. తర్వాత కొంతకాలానికి మరలా రూ.30 వేల తీసుకున్నట్లు తెలిపారు. పొదుపులోనూ రూ.50వేలు తన అవసరాలకై లోను తీసుకున్నానన్నారు. మొత్తంగా బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.30లక్షలు, గ్రూపులో పొదుపు నుంచి రూ.50 వేలు మొత్తం రూ.1.80 లక్షలు రుణం తీసుకున్నట్లు చెప్పారు. ఈనగదును స్థానికంగా ఉన్న సమీప బంధువైన డ్రైవర్ అఫ్జల కు ఇచ్చానన్నారు. అతను లోను నగదు తీసుకున్నప్పటి నుంచి తిరిగి కట్టకపోవడంతో బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది తనని నగదును చెల్లించాలని ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ క్రమంలో వెలుగు సిసి, సంఘమిత్ర, బిందు గ్రూపు సభ్యులు తన పై అవమానకరంగా మాట్లాడుతూ ఒత్తిడి తేవడంతో మనస్థాపానికి గురై సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించానని చెప్పారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, స్థానికుల సహాయంతో వెంటనే ఆమెకు నచ్చజెప్పి టవర్ నుంచి కిందకు దించి సురక్షితంగా ఇంటికి పంపారు. దీనిపై వెలుగు సిబ్బంది మాట్లాడుతూ గ్రూపులో ఆమె తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో ఇతర సభ్యులకు లోను రావడానికి ఇబ్బంది ఏర్పడుతున్నాదని, ఆమె ప్రతినెల గ్రూపులో కటాల్చిన డబ్బులు కట్టకపోవడంతో తాము లోను డబ్బులు కట్టాలని అడిగామన్నారు. గ్రూపులోని సభ్యురాలు లోను డబ్బులు చెల్లించుకుంటే గ్రూపు సభ్యులకు కొత్తగా లోన్లు మంజూరు చేయడానికి అవకాశం ఉండదని దొంగతనం చెల్లించాలని కోరినట్లు తెలిపారు. మొత్తానికి నాటకీయ పరిణామాల మధ్య మహిళా సురక్షితంగా ఇంటికి చేరింది. దీనితో స్థానిక ప్రజలు బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.